క్లుప్తంగా

నూరు శాతం ఈకేవైసీ నమోదు

దెందులూరు: దెందులూరు మండలంలో ఈకేవైసీ పంట నమోదు ప్రభుత్వం నిర్దేశించిన లోపు (అక్టోబర్ 10వ తేదీ మంగళవారం సాయంత్రం) పూర్తి చేశామని దెందులూరు మండల వ్యవసాయ శాఖాధికారి గద్దె రమేష్ అన్నారు. మంగళవారం దెందులూరు మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, రైతుభరోసా కేంద్రాలు, వ్యవసాయ శాఖ సిబ్బందితో పాటు ముఖ్యంగా అన్ని గ్రామాల్లో రైతుల సంపూర్ణ సహకారంతో ఈకేవైసీ నమోదు లక్ష్యాలు సకాలంలో పూర్తి చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

జిల్లాలో నాల్గవ స్థానం

ఈకేవైసీ నమోదులో దెందులూరు మండలం జిల్లాలో నాల్గవ స్థానం సాధించిందని వ్యవసాయ శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ కే.సుబ్బారావు అన్నారు. సమష్టి కృషితో పాటు రైతుల భాగస్వామ్యం తోడైతే వ్యవసాయ రంగంలో, ప్రభుత్వ పథకాల అమలులో సాధించలేనిది ఏదీ ఉండదన్నారు. జిల్లాలో నాల్గవ స్థానం సాధించిన దెందులూరు మండల రైతులకు ఏఓ గద్దె రమేష్, మండల వ్యవసాయశాఖ సిబ్బంది, ఆర్బీకే సిబ్బందిని, అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్బారావు అభినందించారు.

ఫీల్డ్ అసిస్టెంట్లు సక్రమంగా విధులు నిర్వహించాలి

పెదవేగి : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేసే ఫీల్డ్ అసిస్టెంట్లు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని డ్వామా ఏపీ డి ప్రవుల్ల కుమార్ తెలిపారు. మంగళవారం పెదవేగి మండలం లక్ష్మీపురంలో ఫీల్డ్ అసిస్టెంట్ తన విధులను సక్రమంగా నిర్వర్తించడం లేదని గ్రామస్తులు కొందరు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో మంగళవారం గ్రామంలో విచారణ చేపట్టినట్టు ఆయన అన్నారు. విచారణ అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ హేమలత, సర్పంచ్ మేక కనకరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో పారదర్శకత పాటించాలి

ఉంగుటూరు: రాష్ట్రంలో సార్వా పంట ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందని పౌరసరఫరాల శాఖ రాష్ట్ర కమిషన్ వీరపాండ్యన్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో 37 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలుకు రంగం సిద్ధం చేశామని, దీనిపై అధికార యంత్రాంగాన్ని సన్నద్ధం చేస్తున్నట్టు ఆయన తెలిపారు. వెల్లమిల్లి రైతు భరోసా కేంద్రంలో మంగళవారం ఆయన ధాన్యంలో తేమను నిర్ధారించే యంత్రాలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. అనంతరం జిల్లా స్థాయి అధికార్లు, కొంతమంది మిల్లర్లుతో ఉంగుటూరు తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ధాన్యం కొనుగోలు విషయంలో పారదర్శకత పాటించాలని వీరపాండ్యన్ సూచించారు. జేసీ లావణ్య దేవి, జేడీ రామకృష్ణ, జిల్లా సివిల్ సప్లై అధికారి సత్యనారాయణ రాజు, ట్రాన్స్‌పోర్టు కమిషనర్, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ మంజు భార్గవి, డిస్ట్రిక్టు కోఆపరేటివ్ ఆఫీసరు మిల్టన్, తహసీల్దారు వెంకటరమణ, ఎంపీడీవో ప్రేమాన్విత పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలి

నిడమర్రు: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులను ప్రాథమిక స్థాయి నుంచే పోటీ పరీక్షలు ఎదుర్కొనేలా తగిన శిక్షణ ఇవ్వాలని ప్రముఖ దాత సంకు పుల్లయ్య ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం బువ్వనపల్లి ప్రీ హైస్కూల్లో నేషనల్ మెరిట్ కం మీన్స్ (ఎన్ఎంఎంఎస్) ప్రవేశ పరీక్షకు సన్నద్ధమవుతున్న 20 మంది విద్యార్థులకు అవసరమైన రూ.9 వేల విలువైన మెటీరియల్‌ను ఉచితంగా అందజేశారు. హెచ్ఎం సంకు ఏసుబాబు మాట్లాడుతూ తాను చదివిన పాఠశాలకు రూ.3లక్షల విలువైన బెంచీలు డెస్క్‌లు అందజేయడంతో పాటు విద్యార్థుల అభ్యున్నతికి నిరంతరం సహకరిస్తున్న దాత పుల్లయ్యను అభినందించారు. సహోద్యాయయుడు ఎన్వీ సుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెకానిక్ అసోసియేషన్‌కు ఎన్నికలు

దెందులూరు: ప్రజాస్వామ్యబద్ధంగా ఏలూరు టౌన్ ఆటోమొబైల్ మెకానిక్ అసోసియేషన్ ఎన్నికలు 312 మంది సభ్యులతో ఈ నెల 13న ఎన్నికలు నిర్వహిస్తామని ఎన్నికల అధికారులు మల్లవరపు రంగారావు, సీహెచ్‌వీ రమణరావు, ఏ.శ్రీనివాసరావు, ఏ.నాగేశ్వరరావు, కే.మహేశ్వరరావు అన్నారు. మంగళవారం మల్కాపురం మెకానిక్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎన్నికల ప్రక్రియకు సంబంధించి నామినేషన్ల ఉపసంహరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎన్నికల అధికారులు మాట్లాడుతూ అసోసియేషన్ అధ్యక్ష పదవికి అభ్యర్థులుగా కర్రి నాగేశ్వరరావు, బేతపూడి కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా టీ.ముకుందరావు, కర్రి ఈశ్వరరావు పోటీలో ఉన్నారన్నారు. సెక్రటరీగా ఆడపా సత్యనారాయణ, అసిస్టెంట్ సెక్రటరీగా మద్రాపు సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు. ఈనెల 13న ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నిక జరుగుతుందని అనంతరం ఫలితాలను ఏలూరు ఆర్డీఓ, సీనియర్ న్యాయవాదులు, అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రకటిస్తామని మల్లవరపు రంగారావు అన్నారు.

సర్వాంగ సుందరంగా చేబ్రోలు జగనన్న కాలనీ

- సీఎం జగన్ చేతుల మీదుగా వర్చువల్‌గా రేపు ప్రారంభం
- సన్నాహాలు చేస్తున్న అధికార యంత్రాంగం



చేబ్రోలులోని జగనన్న గృహ కాలనీ



జగనన్న కాలనీలో నిర్మించిన రహదారి



చేబ్రోలు జగనన్న కాలనీలో పర్యటిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎమ్మెల్యే వాసుబాబు (ఫైల్)

ఉంగుటూరు: ఏలూరు జిల్లాలో చేబ్రోలు జగనన్న కాలనీ సర్వాగ సుందరంగా సిద్ధమైంది. ఈ కాలనీని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్‌గా గురువారం ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో చేబ్రోలులో అధికారులు ప్రారంభ సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాలో మోడల్ కాలనీల్లో చేబ్రోలు లేఅవుట్ ఉంది. ఈ లేఅవుట్లో 253 ప్లాట్లు ఉన్నాయి. ఇందులో 181 మందికి ఇళ్లు మంజూరు చేశారు. 142 గృహాలను లబ్ధిదారులు నిర్మిస్తున్నారు. ఇప్పటి వరకు 90 ఇళ్లు పూర్తి చేశారు. మిగిలినవి వివిధ దశలలో ఉన్నాయి. ఫలితంగా ఈ కాలనీని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా వర్చువల్ విధానంలో ప్రారంభించేందుకు నాలుగు రోజుల నుంచి సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే కలెక్టరు కాలనీలో పర్యటించి అధికారులకు తగు సూచనలు చేశారు. మిగిలిన తుది దశ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

చురుగ్గా మౌలిక సదుపాయాల ఏర్పాటు

మౌలిక సదుపాయాలను తుదిరూపం తీసుకువచ్చే పనుల్లో అధికార్లు పని చేస్తున్నారు. కాలనీలో రూ.33 లక్షల వ్యయంతో 1,400 మీటర్ల పొడవునా 14 రహదార్లు నిర్మించారు. రూ.15 లక్షల వ్యయంతో అప్రోచ్ రహదారి నిర్మించారు. ప్రతి ఇంటికీ విద్యుత్ సర్వీసు ఉచితంగా అందజేశారు. ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత నిర్మించే క్రమంలో ఇప్పటికి 40 ఇంకుడు గుంతలు తవ్వారు. విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు ఏర్పాటు చేయడంతో కాలనీ చూడముచ్చటగా సిద్ధమైంది.

రాయితీపై నిర్మాణ సామగ్రి అందజేత

ఇంటి నిర్మాణ సమాగ్రి అందజేతలో ప్రభుత్వం సహకరించింది. సిమెంటు బస్తా మార్కెట్‌లో రూ.350 పలుకుతుంటే 267 రూపాయలకే సరఫరా చేశారు. ఐరన్, ఇసుక, గుమ్మాలు కిటికీలు, విద్యుత్ సామగ్రి రాయితీపై అందించారు. ప్రతి గృహ లబ్ధిదారుడికీ ప్రభుత్వం అందించే రూ.1.80 లక్షల రుణంతోపాటు అదనంగా రూ.40 వేలు కలిసి వచ్చేలా అధికార్లు సహకరించారు. ఎస్‌జీహెచ్ ద్వారా డ్వాక్రా సంఘాల సభ్యులకు బ్యాంకు ద్వారా రూ.35 వేలు రుణం మంజూరు చేయించారు. ఈ కాలనీని చూసేందుకు రాష్ట్రస్థాయి హౌసింగు అధికార్లు, జిల్లాస్థాయి అధికార్లు పలుమార్లు వచ్చి పరిశీలించి వెళ్లారు. ఈ కాలనీ ఇలా సిద్ధం కావడానికి స్థానిక ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. చేబ్రోలు ఇంజనీరింగు సహాయకుడు నాగబాబు ప్రత్యేకంగా కృషి చేసి ప్రతి లబ్ధిదారుడుని చైతన్యపర్చి వేగంగా నిర్మాణాలు చేపట్టేలా శ్రద్ధ తీసుకున్నారు. మండల హౌసింగు ఏఈ సురేష్‌బాబు ఎప్పటికప్పుడు బిల్లులు వచ్చేలా చర్యలు తీసుకున్నారు. గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకుడు సొసైటీ అధ్యక్షుడు యెలిశెట్టి పాపారావుబాబ్జి, మాజీ సర్పంచి కరణం బుజ్జి, పంచాయతీ మెంబరు ఆకుల రాజు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర నాయకులు శ్రద్ధ తీసుకోవడంతో జగనన్న కాలనీ చూడముచ్చటగా తయారైంది.

సుందరంగా కాలనీ సిద్ధమైంది



చేబ్రోలు జగనన్న కాలనీ సీఎం చేతుల మీదుగా ప్రారంభం కావడానికి ఏర్పాట్లు చేయడం ఎంతో ఆనందంగా ఉంది. ఇదొక గర్వకారణంగా భావిస్తున్నాం. లబ్ధిదారులు ముందుకు రావడం, స్థానిక నాయకులు, ఎమ్మెల్యే వాసుబాబు ప్రత్యేక శ్రద్ధ కారణంగా కాలనీ సర్వాంగ సుందరంగా తయారైంది. కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాం. ప్రతి ఇంటికీ నీటి కుళాయిలు ఏర్పాటు చేశాం.

– సురేష్‌బాబు, మండల హౌసింగు ఏఈ

లబ్ధిదారులు ముందుకు రావడం అభినందనీయం



లబ్ధిదారులు గృహ నిర్మాణానికి ముందుకు రావడంతో పాటు అందరి కృషి ఫలితంగా చేబ్రోలు జగనన్న కాలనీ సుందరంగా తయారైంది. ఏలూరు జిల్లాలో మోడల్ లేఅవుట్‌గా ఎంపిక కావడం, సీఎం చేతుల మీదుగా ప్రారంభం కావడం ఎంతో ఆనందంగా ఉంది. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, అధికార్లు శ్రద్ధ తీసుకోవడంతో మౌలిక సదుపాయాల కల్పన పనులు వేగంగా పూర్తయ్యాయి.

– ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి విశేష స్పందన



భీమడోలు: భోగాపురంలో రోగులను పరీక్షిస్తున్న గైనిక్, జనరల్ వైద్యులు



పెదవేగి: పౌష్టికాహార ప్రదర్శనను పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్, ఎంపీపీ

భీమడోలు: గుండుగొలను గ్రామ పంచాయతీ పరిధిలోని భోగాపురం సచివాలయం– 3 వద్ద మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. సచివాలయం పరిధిలోని ఇంటింటికీ వెళ్లి సర్వే చేసిన బృందాలు సుమారు 348 మందికి కూపన్లు అందించారు. వారితో పాటు పాఠశాలల చిన్నారులకు సైతం వైద్య సేవలందించారు. ఏర్పాట్లను భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతి దేవి పరిశీలించారు. అనంతరం వైద్యులు కల్యాణీ మహేశ్వరి, గైనిక్, పిల్లల వైద్య నిపుణులు వైద్య పరీక్షలు చేసారు. కంటి వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లజోళ్లను ఉచితంగా అందించారు. ఎంఈవో 2 భాస్కర్, హెచ్‌వీ కె.మల్లేశ్వరీ, సూపర్‌వైజర్ కవిత, వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగులు, ఆశా వర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఉంగుటూరు హైస్కూలులో..

ఉంగుటూరు: ఉంగుటూరు జిల్లా పరిషత్ హైస్కూలు వద్ద నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని మండల పరిషత్ అధ్యక్షురాలు ఘంటా శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, పార్టీ మండల అధ్యక్షుడు మరడ మంగరావు, ఎంపీటీసీ–1 పెనుగొండ బాలకృష్ణ, ఎంపీటీసీ– 2 సందక రాంబాబు, జిల్లా వీవర్స్ అధ్యక్షుడు దొంతంశెట్టి సత్యనారాయణ, పంచాయతీ రాజ్ జిల్లా అధ్యక్షుడు పుప్పాల గోపి, జిల్లా కార్యవర్గ సభ్యురాలు మంద జయలక్ష్మి, ఎంపీటీసీ చాంబర్ అధ్యక్షుడు బండారు నాగరాజు, దూసనపూడి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. డా.వర్మ ఆధ్వర్యంలో నలుగురు వైద్యులు సేవలు అందించారు.

పేదలకు వరం జగనన్న ఆరోగ్య సురక్ష

గణపవరం: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో నాణ్యమైన అన్నిరకాల వైద్యసేవలు ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని, ఈ కార్యక్రమం పేదలకు వరమని గణపవరం మండలం మొయ్యేరు సర్పంచ్ దుళ్ల కుటుంబరావు అన్నారు. మంగళవారం గణపవరం మండలం మొయ్యేరులో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఎంపీడీవో జ్యోతిర్మయి, ఎంపీటీసీ సభ్యురాలు ద్వారంపూడి జ్యోతి, సొసైటీ అధ్యక్షుడు ఈదర అశోకచక్రవర్తి, పార్టీ గ్రామ అధ్యక్షుడు గంటా పద్మాజీరావు, మాకా శ్రీను పాల్గొన్నారు. ఈశిబిరంలో సుమారు ప్రసూతి వైద్య నిపుణులు దివ్యారెడ్డి, నిహారిక, 250 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి

పెదవేగి : జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కె.ఆర్.ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ జీవీవీ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం పెదవేగి మండలం కొప్పుల వారి గూడెంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఆయన పాల్గొని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాతా రమ్య, సర్పంచ్ చలపాటి మణి , ఎంపీటీసీ యర్ర సలోమి, ఎమ్మార్వో నాగరాజు, పీఓపీఆర్డీ శ్రీనివాస్, ఎంఈఓ 2 అరుణ్ కుమార్, అంగన్‌వా సూపర్వైజర్ పార్వతి, పంచాయతీ కార్యదర్శులు, ప్రసాద్ స్పెషలిస్ట్ డాక్టర్లు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణతోనే అభివృద్ధి

దెందులూరు: ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం ఉంటేనే ఆ కుటుంబం, ఆ గ్రామం అభివృద్ధి పథంలో సాగుతుందని దెందులూరు తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య, వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. మంగళవారం సానిగూడెంలో సర్పంచ్ సనివల్లి రామకృష్ణ (విష్ణు), పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కొరపాటి శాంతి ఆధ్వర్యంలో నిర్వహించారు. 312 మందికి 20 విభాగాల్లో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. సోమవరప్పాడు ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ పద్మావతి ఆధ్వర్యంలో సోమవరప్పాడు సెక్టార్‌లోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సంపూర్ణ పోషణ ఆహార స్టాల్‌ను ఏర్పాటు చేశారు. జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, సూపర్‌వైజర్ పద్మావతి, అంగన్‌వాడీ టీచర్లను అభినందించారు.

కొక్కిరపాడులో..

పెదపాడు: పేదల కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టినట్లు దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్ తెలిపారు. మండలంలోని కొక్కిరపాడు శివారు దాసరిగూడెంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారికి వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. పెదపాడు ఎంపీడీవో ఎస్ నిర్మల జ్యోతి ఈఓఆర్డీ సూర్యకుమార్, డిప్యూటీ తహసీల్దార్ ఎన్‌వీడీవీ ప్రసాద్, సర్పంచ్ మరీదు రెడ్డియ్య పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం

- పెదపాడులో గడపగడపకు మన ప్రభుత్వం
- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి



పెదపాడులో ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి



కైకరంలో మహిళకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

పెదపాడు: విద్య, వైద్య రంగాలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేస్తున్నారని, దీనిలో భాగంగా రూ.వేల కోట్ల రూపాయలు నిధులు ప్రభుత్వం ఖర్చు చేస్తోందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదపాడు శివారు రామచంద్రపురంలో మంగళవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన గ్రామస్తులు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని క్రైస్తవులు శ్మశాన వాటికకు స్థలం కావాలని కోరారు. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి గడప గడపకూ వెళ్లి వారికి అందుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. డ్రైనేజీలు అభివృద్ధి చేయాలని, కమ్యూనిటీ హాలు నిర్మాణానికి నిధులు మంజూరు కావాలని స్థానికులు కోరారు. దీంతో అధికారులు అంచనాలు వేయాలని ఆదేశించారు. అర్హులైన వారికి పథకాలు అందకుంటే సహించేది లేదని అధికారులను, సచివాలయ ఉద్యోగులను హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్, పెదపాడు మండల కన్వీనర్ అప్పన ప్రసాద్, ఎంపీపీ బత్తుల రత్నకుమారి, పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ అక్కినేని గోపి, విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు కత్తుల రవికుమార్, వైఎస్ ఎంపీపీ రెడ్డి స్వర్ణకుమారి, స్థానిక సర్పంచ్ కొత్తూరు జీవనకుమారి , ఎంపీటీసీ కర్రె మరియమ్మ, కొత్తూరు విమలారావు, నాయకులు సంబంగి శ్రావణ్‌కుమార్, తహసీల్దార్ జీ విజయకుమార్ రాజు, ఎంపీడీవో ఎస్ నిర్మలజ్యోతి ఏపీఎం దాసరి సుమలత పాల్గొన్నారు.

నవరత్నాలతో పెరిగిన ప్రజల జీవన ప్రమాణం

గణపవరం: రాష్ట్ర చరిత్రలో ఏ ప్రభుత్వమూ అమలు చేయనన్ని సంక్షేమ పథకాలు నాలుగున్నరేళ్లలో అమలుచేసి, ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. మంగళవారం సాయంత్రం ఉంగుటూరు మండలం కైకరంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏఒక్కరూ ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడకూడదన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నారని అన్నారు. సీఎం జగన్‌కు అందరూ అండగా ఉండాలన్నారు. ఈసందర్భంగా నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన లబ్ధిని ప్రజలకు వివరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులకు బాధ్యత అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పత్సా మురళీ, ఎంపీటీసీ సభ్యులు పి.వెంకన్నబాబు, వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ జిల్లా కన్వీనర్ పుప్పాల గోపి, ఎంపీపీ కె.జయలక్ష్మి, జెడ్పీటీసీ గంటా శ్రీలక్ష్మి, గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు నక్కాశ్రీను, మండల పార్టీ కన్వీనర్ మరడ మంగారావు, భీమడోలు మండల పార్టీ కన్వీనర్ రావిపాటి సత్తిబాబు, జిల్లా నాయకులు మందాజయలక్ష్మి, కొరిపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బస్సుపాసుల పంపిణీ

ఉంగుటూరు: బాదంపూడి హైస్కూలు విద్యార్థులకు ఆర్టీసీ ఉచిత బస్సుపాసులను మంగళవారం పంపిణీ చేశారు. ఎంపీపీ ఘంటా శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ మరడ మంగరావు, సర్పంచి కంకట పద్మలీల, ఉప సర్పంచి దాసరి అప్పన్న, పంచాయతీరాజ్ జిల్లా అధ్యక్షుడు పుప్పాల గోపి, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరి ఆరోగ్య భద్రత ప్రభుత్వ ధ్యేయం



పూళ్లలో పీహెచ్‌సీ అదనపు భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

భీమడోలు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఒక్కరి ఆరోగ్య భద్రతకు వైద్య రంగానికి పెద్ద పీట వేస్తున్నారని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. పూళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 15వ ఆర్థిక సంఘం ఆరోగ్య నిధి నుంచి రూ.50లక్షలతో చేపట్టనున్న బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ నిర్మాణ పనులకు ఆయన మంగళవారం శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పుప్పాల వాసు బాబు హాజరయ్యారు. ఎంపీపీ కనమాల రామయ్య, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, డీసీసీబీ డైరెక్టర్ కందులపాటి శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమ జూనియర్, ఉపసర్పంచ్ పెద్దిరెడ్డి హరిబ్రహ్మానాయుడు, ఉపాధ్యక్షుడు పులిచర్ల వెంకటకృష్ణారావు, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు,కురెళ్లగూడెం సర్పంచ్ గుడివాడ గౌతమి సీతారామాంజనేయులు, ఎంపీటీసీలు బొల్లారపు జ్ఞానరమ్య పవన్, గంటా శ్రీనివాసరావు, పాల్నాటి శ్రీను పాల్గొన్నారు.

పదేళ్ల కల నెరవేరుతున్న తరుణం..

- నేడు దేవరగోపవరం వద్ద నూతన వంతెన ప్రారంభోత్సవం
- ప్రభుత్వ నిధులకు, తోడు దాతల సహకారం
- రూ.20 లక్షలతో పందికోడుపై బెయిలీ వంతెన నిర్మాణం



దేవరగోపవరం వద్ద పందికోడుపై నూతనంగా నిర్మించిన బెయిలీ వంతెన

నిడమర్రు: దేవరగోపవరం గ్రామస్తుల పదేళ్ల కల నేడు నెరవేర నుంది. దశాబ్దకాలంగా పదిరకోడు మురుగు డ్రెయిన్‌పై కాలిబాట వంతెన నిర్మాణం కోసం గ్రామస్తులు చేయని ప్రయత్నం లేదు. 2013 ఆగస్టులో వచ్చిన వరదల్లో పందికోడు మురుగు డ్రెయిన్‌పై దేవరగోపవరం గ్రామం వద్ద ఉన్న సీసీ కాలిబాట వంతెన కుంగి కొట్టుకుపోయింది. దీంతో నాటి నుంచి అక్కడ కొత్త వంతెన నిర్మించాలని వచ్చిన ప్రతీ అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతులు గ్రామ పెద్దలు ఇస్తున్నారు. ప్రభుత్వ నిధులకు తోడు దాతలు, దేవరగోపవరం గ్రామస్తుల ఆర్థిక సహకారంతో రూ.20 లక్షల వ్యయంతో బెయిలీ వంతెనను నిర్మించారు. ఈ ఐరన్ వంతెనను బుధవారం ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ప్రారంభించనున్నారు.

గడపగడపకు మన ప్రభుత్వంతో పరిష్కారం

గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా దేవరగోపవరం గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే వాసుబాబుకు పందికోడుపై కాలి బాట వంతెన నిర్మాణం ఆవశ్యకత స్థానికులు వివరించారు. ఈ ప్రాంతానికి కిలోమీటర్లులోపు పెదనింద్రకొలను గ్రామం వద్ద ఉన్న పందికోడుపై రూ 2.8 కోట్లతో నిర్మించిన వంతెన ఉండటంతో సాంకేతికంగా భారీ వంతెన నిర్మాణానికి అనుమతులకు ఇబ్బందులు ఉన్నట్లు అధికారులు వివరించారు. దీంతో ఎమ్మెల్యే వాసుబాబు కాలిబాట బెయిలీ వంతెనకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించడంతో నూతన ఇనుప వంతెన నిర్మాణానికి రూ.20 లక్షలు అంచనా వ్యయంగా నిర్ధారించారు. దీంతో జెడ్పీ నిధులు రూ.5 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలు ఎమ్మెల్యే మంజూరు చేయించారు. దీంతో దేవరగోపవరం గ్రామస్తులు ముందుకు వచ్చి రూ.6 లక్షలు సమకూర్చగా మిగిలిన రూ.4లక్షలను జెడ్పీటీసీ కోడే కాశి ఆధ్వర్యంలో దాతల నుంచి సేకరించినట్లు దేవరగోపవరం గ్రామ పెద్దలు తెలిపారు.

విద్యార్థులకు, రైతులకు చాలా ఉపయోగం

పెదనింద్రకొలను జెడ్పీస్కూల్ ఈ నూతనంగా నిర్మించిన బెయిలీ వంతెన సమీపంలో ఉండటంతో దేవరగోపవరం నుంచి ఆ జెడ్పీ స్కూల్‌కు వెళ్లే విద్యార్థులకు కాలినడకన వెళ్లేందుకు అనువుగా ఉంటుంది. దేవరగోపవరంలోని రైతులకు పందికోడుకు అవతలి వైపు పొలాలు, ఆక్వా చెరువులు ఉండటంతోపాటు వీరందరికీ దూరాభారం తగ్గుతుందని గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామానికి సంబంధించిన హిందూ శ్మశానవాటిక ఈ బెయిలీ వంతెన సమీపంలో పందికోడు అవతలి గట్టు వైపు ఉంటడంతో దహన సంస్కారాలకు ఇక నుంచి గ్రామస్తుల సమస్య పరిష్కారమవుతుంది. ఇప్పటి వరకూ వారంతా గ్రామానికి దూరంగా ఉన్న పెదనింద్రకొలను వద్ద ఉన్న పందికోడు వంతెనపై నుంచి చుట్టూ తిరిగి వెళ్లేవారు. దీంతో సుమారు 3 నుంచి 4 కిలోమీటర్లు మేర వారందరికీ దూరాభారంగా ఉండేది. ఆ సమస్య నేటితో పరిష్కారం అవుతున్నందుకు దేవరగోపవరం గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

దాతల సహకారం అభినందనీయం



దేవరగోపవరం గ్రామ వద్ద పందికోడుపై కాలిబాట వంతెన నిర్మాణంలో దాతల సహకారం అభినందనీయం. పదేళ్లుగా ఈ సమస్య పరిష్కారానికి గ్రామస్తులు కృషి చేస్తున్నారు. వంతెన నిర్మాణానికి రూ.20 లక్షల వ్యయం అంచనా వేయగా మండల పరిషత్ నుంచి, జెడ్పీ నుంచి రూ.10 లక్షలు కేటాయించారు. మిగిలిన రూ.10 లక్షలు గ్రామ పెద్దలు, దాతలు సమకూర్చడంతో సమస్య పరిష్కారమైంది.

– కోడే కాశి, జెడ్పీటీసీ, నిడమర్రు